ఆణిముత్యాలు

పేదింటి విద్యా కుసుమాలు విరబూశాయి. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో ప్రభుత్వ పాఠశాలల్లో సకల సదుపాయాలు కల్పించడంతో చదువులో రాణించారు. అత్యధిక మార్కులతో టాపర్లుగా నిలిచారు. అలాంటి వారి భవితకు మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ట్రిపుల్ ఐటీలు దివిటీలుగా నిలిచాయి. ఉన్నత ఆశయాలతో ఆ ఆణిముత్యాలు నేడు ట్రిపుల్ ఐటీలోకి అడుగు పెడుతున్నారు. పట్టుదల ఉంటే చాలు.. పేదరికం అడ్డు కాదని నిరూపిస్తూ ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకున్నారు.

- నూజివీడు ట్రిపుల్ ఐటీకి ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ఎంపిక
- ఆనందం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు



నూజివీడు ట్రిపుల్ ఐటీకి ఎంపికైన మధురానగర్ హైస్కూల్ విద్యార్థినులు బి.భార్గవి, జి.భార్గవిని అభినందిస్తున్న హెచ్‌ఎం శాంతికుమారి, ఉపాధ్యాయ సిబ్బంది

సీతంపేట/సీతమ్మధార: ప్రతిష్టాత్మక నూజివీడు ట్రిపుల్ ఐటీకి పలువురు ఉత్తర నియోజకవర్గ విద్యార్థులు అర్హత సాధించారు. పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించి ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్ కోర్సు చదివేందుకు రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్(ఆర్‌జీయూకేటీ)లో అడ్మిషన్లు పొందారు. వీరిని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించి, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

ఎంపికైన విద్యార్థులు వీరే..

◆ 25వ వార్డు మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్‌లో ఇటీవల పదో తరగతి పూర్తి చేసిన ఇద్దరు విద్యార్థినులు బి.భార్గవి, జి.భార్గవి నూజివీడు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. టెన్త్‌లో బి.భార్గవి 579/600 మార్కులు, జి.భార్గవి 577/600 మార్కులు సాధించారు. హెచ్‌ఎం శాంతికుమారి, ఉపాధ్యాయ సిబ్బంది సంతోషం వ్యక్తం చేసి వారిని అభినందించారు.

◆ 26వ వార్డు అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీలోని జీవీఎంసీ హైస్కూల్ విద్యార్థి చింతపల్లి భరత్ నూజివీడు ఐఐఐటీకి ఎంపికయ్యాడు. టెన్త్‌లో 586/600 మార్కులు సాధించి స్కూల్ టాపర్‌గా నిలిచాడు. భరత్‌ను స్కూల్ హెచ్‌ఎం లక్ష్మీ నరస, సీనియర్ ఉపాధ్యాయుడు ఆర్.శ్రీనివాసరావు, సిబ్బంది అభినందించారు.

◆ 24వ వార్డు సీతమ్మధార పీ అండ్ టీ కాలనీలోని జీవీఎంసీ-ఎస్‌ఎంసీ హైస్కూల్ విద్యార్థి ఉప్పాల ప్రతీక్ నూజివీడు ట్రిపుల్ టీకి ఎంపికయ్యాడు. టెన్త్‌లో 580/600 మార్కులు సాధించాడు. ప్రతీక్‌ను హైస్కూల్ హెచ్‌ఎం డి.రాంప్రసాద్, ఉపాధ్యాయులు అభినందించారు. హెచ్‌ఎం ఆధ్వర్యంలో నగదు పురస్కారం అందజేసి, ఘనంగా సత్కరించారు.


తల్లిదండ్రులు, అన్నయ్యతో నూజివీడు ట్రిపుల్ ఐటీకి ఎంపికైన ఉప్పాల ప్రతీక్

నూజివీడు ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులు

- బి.భార్గవి(579/600 మార్కులు), జి.భార్గవి (577/600 మార్కులు) 25వ వార్డు మధురానగర్ జీవీఎంసీ ఉన్నత పాఠశాల
- చింతపల్లి భరత్ (586/600 మార్కులు) 26వ వార్డు అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్
- ఉప్పాల ప్రతీక్ (580/600 మార్కులు) 24వ వార్డు పీఅండ్‌టీ కాలనీ జీవీఎంసీ-ఎస్‌ఎంసీ హైస్కూల్

కంప్యూటర్ ఇంజినీర్ అవుతా..



నాన్న అప్పలనాయుడు కారు డ్రైవర్. అమ్మ గృహిణి. అక్కయ్యపాలెంలో ఉంటున్నాం. ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్‌లో 7 నుంచి 10వ తరగతి వరకు చదివాను. టెన్త్‌లో 586 స్కోర్ చేశాను. నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చింది. స్కూల్ హెచ్‌ఎం, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో మంచి స్కోర్ రావడంతో ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యాను. ఈ నెల 22న కౌన్సెలింగ్ ఉంది. చాలా ఆనందంగా ఉంది. కంప్యూటర్ సైన్స్ చదివి పెద్ద కంప్యూటర్ ఇంజినీర్ కావాలనుకుంటున్నాను.

– **చింతపల్లి భరత్**, ఎన్జీజీవోస్ కాలనీ హైస్కూల్

హెచ్‌ఎం ప్రోత్సాహంతో ఎంపికయ్యా..



మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్‌లో 8 నుంచి 10వ తరగతి వరకు చదివాను. టెన్త్‌లో 579 మార్కులు వచ్చాయి. నూజివీడు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యాను. టెన్త్‌లో మంచి మార్కులు తెచ్చుకుంటే ట్రిపుల్ ఐటీలో సీటు వస్తుందని, భవిష్యత్ బాగుంటుందని స్కూల్ హెచ్‌ఎం శాంతి కుమారి ఎప్పుడూ చెబుతుండే వారు. గతంలో ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించిన విద్యార్థుల చేత మోటివేషన్ క్లాసులు చెప్పేవారు. ఆ స్ఫూర్తితో రోజూ తెల్లవారుజాము 4 గంటలకు లేచి చదివేదాన్ని.కంప్యూటర్ ఇంజినీర్ కావాలని అనుకుంటున్నాను. మాది సీతంపేట. నాన్న ఆటో డ్రైవర్, అమ్మ హౌస్ వైఫ్.

– **బి.భార్గవి**, మధురానగర్ హైస్కూల్

సీఎస్‌ఈ చదువుతాను..



మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్‌లో 6 నుంచి 10వ తరగతి వరకు చదివాను. టెన్త్‌లో 577 మార్కులు సాధించాను. నాన్న ఆటో డ్రైవర్, అమ్మ గృహిణి. మద్దిలపాలెంలో ఉంటున్నాం. హెచ్‌ఎం శాంతికుమారి, ఫిజిక్స్ మేడం భ్రమరాంబ ప్రోత్సాహంతో పట్టుదలతో చదివాను. పదిలో మంచి మార్కులు సాధిస్తే ట్రిపుల్ ఐటీలో సీటు వస్తుందని, లైఫ్ బాగుంటుందని తరచూ చెప్పేవారు. మంచి మార్కులు రావడంతో నూజివీడు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యాను. సీఎస్‌ఈ చదవి, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అవ్వాలనుకుంటున్నాను.

– **జి.భార్గవి**, మధురానగర్ హైస్కూల్

యాప్ క్రియేటర్ అవుతా..



నా కల నెరవేరింది. ఐఐఐటీలో సీటు సంపాదించాను. 6 నుంచి 10వ తరగతి వరకు ఎస్‌ఎంసీ హైస్కూల్‌లో చదివాను. 580/600 మార్కులు సాధించి స్కూల్ టాపర్‌గా నిలిచాను. నూజివీడు ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడం ఎంతో ఆనందంగా ఉంది. ఇంటర్‌లో ఎంపీసీ చదివిన తరువాత కంప్యూటర్ సైన్స్(సాఫ్ట్‌వేర్ ఇంజినీర్) చేసి ఒక యాప్ సృష్టిస్తాను. స్కూల్‌లో హెచ్‌ఎం రాంప్రసాద్‌తోపాటు ఏడుగురు ఉపాధ్యాయులు చదువులో నాకు అన్ని విధాలా సహకరించారు. తండ్రి నాగేంద్రబాబు మెకానిక్, తల్లి లక్ష్మి టైలరింగ్ షాపులో పనిచేస్తున్నారు. అన్నయ్య అభి డిగ్రీ పూర్తి చేసి.. ఓ బంగారు నగల దుకాణంలో పనిచేస్తున్నాడు. మేం హెచ్‌బీ కాలనీలో నివసిస్తున్నాం. మా తల్లిదండ్రుల కష్టం చూసి.. కష్టపడి చదివి గోల్ రీచ్ అయ్యాను.

– **ఉప్పాల ప్రతీక్**, పీఅండ్‌టీ కాలనీ ఎస్‌ఎంసీ హైస్కూల్

క్లుప్తంగా

షిర్డీసాయికి లక్ష పుష్పార్చన


సాయిబాబాకు పుష్పార్చన చేస్తున్న అర్చకులు

సీతమ్మధార: నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర, అయ్యప్ప, షిర్డీసాయిబాబా దేవాలయంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ప్రధాన అర్చకుడు రాజాస్వామి ఆధ్వర్యంలో పది మంది అర్చక బృందం షిర్డీసాయికి పలు రకాల పూలతో లక్ష పుష్పార్చన నిర్వహించారు. ఈ నెల 20 వరకు ప్రతి రోజు పుష్పార్చన చేస్తామని అర్చకులు తెలిపారు. సాయిబాబా దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఆలయ సిబ్బంది వనజాక్షి, శివ పాల్గొన్నారు.

వాకర్స్ పార్కు పరిశుభ్రతకు శ్రమదానం


పార్కులో శ్రమదానం చేస్తున్న వాకర్స్

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్కు పరిశుభ్రతకు అవసరమైన చర్యలు తీసుకున్నారు. పార్కులో గురువారం వాకర్స్ క్లబ్ సభ్యులు, వాకర్స్ శ్రమదానం చేశారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున కలుపు మొక్కలు, వృక్షాల కొమ్మలను తొలగించారు. ఇప్పటికే పెరిగిన మొక్కలను ప్రూనింగ్ చేశారు. పార్కు అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి ఆధ్వర్యంలో వాకర్స్, క్లబ్ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పచ్చదనం పెంపులో భాగంగా కొత్తగా మొక్కలు నాటారు.

ఇష్టానుసార పార్కింగ్‌తో ట్రాఫిక్ సమస్య


ఫోర్త్‌టౌన్ పీఎస్ ఎదురుగా సర్వీస్ సెంటర్ ముందు పార్క్‌చేసిన వాహనాలు

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఇటీవల మోటార్ వాహనాల సర్వీస్ సెంటర్ షోరూంను ప్రారంభించారు. ఇక్కడ షోరూంకు సంబంధించి వాహనాలు పార్కింగ్ చేయాలని బోర్డు ఏర్పాటు చేశారు. దీనిని పట్టించుకోకుండా పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారుల వాహనాలతోపాటు స్టేషన్ ఉద్యోగులు తమ వాహనాలను అక్కడే నిలిపివేయడంతో ఈ రోడ్డులో ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. షోరూం పక్కనే కారు మెకానిక్ వాహనాలు రోడ్డుపై ఉండటంతో రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. సంబంధిత అధికారులు పరిశీలించి ఈ మార్గంలో ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

వ్యక్తి అదృశ్యం


దారపునేని వివేక్

గోపాలపట్నం: రెండు రోజుల్లో వస్తానని ఢిల్లీ వెళ్లిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలిలా.. సీతమ్మధార ఏపీహెచ్‌బీ కాలనీలో నివాసముంటున్న దారపునేని వివేక్ జాన్సన్ అండ్ జాన్సన్ సంస్థలో పని చేస్తున్నాడు. ఈ నెల 13న ఢిల్లీ వెళుతున్న నేపథ్యంలో కరాసాలో ఉన్న తోడల్లుడి ఇంటికి వచ్చాడు. అదే రోజు వివేక్‌ను తోడల్లుడు ఎయిర్‌పోర్టులో డ్రాప్ చేశాడు. అయితే 18వ తేదీ అయినా రాకపోవడం, ఫోన్ స్విచ్ఛాఫ్ కావడంతో ఆందోళన చెందిన వివేక్ భార్య అనూషా పోలీసులను ఆశ్రయించింది. విమానాశ్రయంలో టికెట్ తీసుకుని ఇమిగ్రేషన్‌లో చెక్ అవుట్ కాకుండానే వివేక్ బయటకు వచ్చినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. దీంతో వివేక్ ఢిల్లీ వెళ్లలేదని స్పష్టమైంది. వివేక్‌ను గుర్తిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని ఎయిర్‌పోర్టు పోలీసులు కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

అప్రమత్తంగా ఉండండి


సచివాలయాల మహిళా పోలీసులకు సూచనలిస్తున్న సీఐ విజయకుమార్

సీతమ్మధార: సచివాలయ మహిళా పోలీసులు తమ పరిధిలో అన్ని వేళలా అప్రమత్తంగా ఉండాలని సీఐ ఎస్.విజయకుమార్ సూచించారు. ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో గురువారం స్టేషన్ పరిధిలోని 35 సచివాలయాల మహిళా పోలీసులకు కొత్త చట్టాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ కెమెరాలపై దృష్టి సారించాలన్నారు. మద్యానికి బానిసలైన వారు ఎవరైనా ఉంటే తక్షణమే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. మీ పరిధిలో ఎటువంటి నేరాలు జరిగినా.. వెంటనే పోలీస్ స్టేషన్‌కు తెలియపరచాలన్నారు. చీటీలు వేసిన వారి పేర్లు తెలియజేయాలని, సమస్యాత్మక ప్రాంతాలపై ఎక్కువ నిఘా పెట్టాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారికి అవగాహన కల్పించాలని చెప్పారు. హెల్మెట్ ధరించని వాహన చోదకులు, వాహన పత్రాలు సక్రమంగా లేనివారు, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేసిన వారు, వాహనాలు నడిపే మైనర్లపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ వెంకటరావు, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

సీతమ్మధార: విద్యుత్ సరఫరాలో అంతరాయాలను తగ్గించే నిమిత్తం ఆశీలమెట్ట సెక్షన్ ఆఫీస్ పరిధిలోని 11 కేవీ ఏఎస్సార్ నగర్, 11 కేవీ బీఎస్ లేఅవుట్, 11కేవీ ఏపీఎస్‌ఈబీ ఫీడర్ల ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ జోన్-1 ఈఈ బి.సింహాచలం నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు బాలయ్యశాస్త్రి లేఅవుట్, ఏపీఎస్‌ఈబీ కాలనీ, డాక్టర్ గణేష్‌కుమార్ హాస్పిటల్, ఏఎస్సార్ నగర్, సీతమ్మధార పరిసర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఎన్‌ఎస్‌టీఎల్ పరిధిలో..

మద్రిపాలెం: జోన్-2 ఎన్‌ఎస్‌టీఎల్ పరిధిలోని 11 కేవీ తెన్నేటి నగర్, సీతన్న గార్డెన్స్ ఫీడర్ల నిర్వహణ పనుల్లో భాగంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు కనకదుర్గా ఫంక్షన్ హాల్ జంక్షన్, మాధవధార, గాయత్రి విద్యా మందిర్ రోడ్డు, జనత గ్యారేజ్ జంక్షన్, గ్యాస్ గొడౌన్ జంక్షన్, తెన్నేటినగర్, సీతన్న గార్డెన్స్, నరసింహనగర్, ఎంఎస్‌ఆర్ పార్కు, విద్యానగర్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజలు గమనించాలని కోరారు.

ప్రయోగాత్మక హాల్ట్‌ల పొడిగింపు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల సౌకర్యార్థం పలు రైళ్లకు ఆయా స్టేషన్లలో కల్పించిన ప్రయోగాత్మక హాల్ట్‌లను మరికొంత కాలం పొడిగిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. భువనేశ్వర్-సికింద్రాబాద్(17015) విశాఖ ఎక్స్‌ప్రెస్‌కు సత్తెనపల్లె, పిడుగురాళ్ల, నడికుడి, మిర్యాలగూడ, నల్గొండ స్టేషన్లలో హాల్ట్‌లను మరికొంత కాలం పొడిగించారు. విశాఖపట్నం-మహబూబ్‌నగర్(12861) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు మధిర స్టేషన్‌లో హాల్ట్‌ను కొనసాగించారు. పూరీ-తిరుపతి(17479) ఎక్స్‌ప్రెస్‌కు, బిలాస్‌పూర్-తిరుపతి(17481) ఎక్స్‌ప్రెస్‌కు చిన్న గంజాం స్టేషన్‌లో హాల్ట్ కొనసాగుతుంది. గుంటూరు-రాయగడ(17243) ఎక్స్‌ప్రెస్‌కు భీమడోలు స్టేషన్‌లో హాల్ట్ కొనసాగుతుంది.

కొచ్చువేలి-బరౌని మధ్య ప్రత్యేక రైలు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా కొచ్చువేలి-బరౌని మధ్య స్పెషల్ రైలు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. కొచ్చువేలి -బరౌని (06091) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ కొచ్చువేలిలో ఈ నెల 20న ఉదయం 8 గంటలకు బయల్దేరి 21న ఉదయం 11.45 గంటలకు దువ్వాడకు.. 22న మధ్యాహ్నం 2.30 గంటలకు బరౌని చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో బరౌని-కొచ్చువేలి (06090) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ బరౌనిలో ఈ నెల 23వ తేదీ 11.30 గంటలకు బయల్దేరి మూడో రోజు తెల్లవారు 5.25 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 5.30 గంటలకు బయల్దేరి శుక్రవారం మధ్యాహ్నం 1.30 గంటకు కొచ్చువేలి చేరుకుంటుంది.

విశాఖపట్నం-పలాస గమ్యం కుదింపు

విశాఖపట్నం -పలాస (07470) మెము రైలు ఈ నెల 22, 25, 27వ తేదీల్లో శ్రీకాకుళం రోడ్ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో పై తేదీల్లో పలాస-విశాఖపట్నం(07471) మెము రైలు శ్రీకాకుళం రోడ్ నుంచి బయల్దేరుతుంది.

20న వాక్ ఇన్ ఇంటర్వ్యూలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కేంద్రీయ విద్యాలయంలో ఈ నెల 20న కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఉద్యోగ నియామకాలకు వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు విద్యాలయం ప్రిన్సిపాల్ వంశీకృష్ణ తెలిపారు. పీజీటీ విభాగంలో కామర్స్, ఎకనామిక్స్, టీజీటీ విభాగంలో ఇంగ్లిష్, సంస్కృతం, సైన్స్, సోషల్ సైన్స్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని చెప్పారు. అర్హులైన అభ్యర్థులు అన్ని ధ్రువపత్రాలతో ఆ రోజు విద్యాలయానికి హాజరు కావాలని ఆయన కోరారు.

ఇగ్నో ప్రవేశాల గడువు పొడిగింపు

ఎంవీపీకాలనీ: ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం(ఇగ్నో) 2024 విద్యా సంవత్సరం జూలై ప్రవేశాల గడువును పొడిగించింది. ఈ మేరకు ఇగ్నో విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం సంచాలకుడు డాక్టర్ గోనిపాటి ధర్మారావు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ కేంద్రం పరిధిలోని 11 జిల్లాల విద్యార్థులకు డిగ్రీ, పీజీ, డిప్లమో, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల విద్యార్థులు https://ignouadmission.samarth.edu.in/ వెబ్‌సైట్‌ను సందర్శించి.. ఆయా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇందుకు జూలై 31వ తేదీతో గడువు ముగుస్తుందని, పూర్తి వివరాలకు ఉషోదయ కూడలిలోని ఇగ్నో కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

కలెక్టర్‌ను కలిసిన ఎంపీ బాబూరావు


కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీ గొల్ల బాబూరావు

మహారాణిపేట: కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్‌ను గురువారం రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్ కార్యాలయంలో ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి.. పలు అంశాలపై మాట్లాడారు. ఎంపీ వెంట వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బోని శివరామకృష్ణ ఉన్నారు.

సీతమ్మధార రైతుబజార్‌లో టమాటా విక్రయాలు



సీతమ్మధార: టమాటా ధరలు విపరీతంగా పెరగడంతో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో చిత్తూరు జిల్లా నుంచి కొనుగోలు చేసి శుక్రవారం నుంచి సీతమ్మధార రైతుబజారులో 8 కౌంటర్ల ద్వారా కిలో రూ.58కు విక్రయిస్తున్నట్లు ఈవో కొండబాబు తెలిపారు. సీతమ్మధార రైతుబజారులో 2,600 కిలోల టమాటా అందుబాటులో ఉందని చెప్పారు. టమాటా ధరలు తగ్గేంత వరకు రైతుబజారులో విక్రయిస్తామన్నారు. వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఈవో కోరారు. బహిరంగ మార్కెట్‌లో కిలో టమాటా రూ.80 వరకు విక్రయిస్తున్నారు.

కొత్తది వేశారు.. పాతది వదిలేశారు


మ్యాన్‌హోల్‌కు కొత్త పలకలు వేసి.. పాతవి అక్కడ వదిలేసిన జీవీఎంసీ సిబ్బంది

మద్రిపాలెం: జీవీఎంసీ వార్డుల్లో స్థానిక ప్రజలను సమస్యలు వెంటాడుతున్నాయి. ఈ నెల 20న జరిగే గిరిప్రదక్షిణ సందర్భంగా ఉత్తర నియోజకవర్గంలోని సీతమ్మధార నుంచి ఆర్‌అండ్‌బీ దరి ఫెయిర్‌ఫీల్డ్ మారియట్ హోటల్ వరకు జీవీఎంసీ, సింహాచలం దేవస్థానం అధికారులు రోడ్లు, లైట్లకు సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో 51వ వార్డు వుడా కాలనీ వినాయకుడి గుడికి కూతవేటు దూరంలో యూజీడీ మ్యాన్‌హోల్‌కు జీవీఎంసీ సిబ్బంది మరమ్మతు చేసి కొత్తది వేశారు. పాత దాన్ని అలాగే రోడ్డు పక్కన వదిలేశారు. దీంతో అటుగా వెళ్తున్న పాదచారులు, వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రమాదాల బారిన పడక తప్పదని కొందరు అంటున్నారు. ప్రజలకు ఇబ్బంది కలుగకుండా పనులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

28న గవర విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు


కార్యక్రమ కరపత్రికను ఆవిష్కరిస్తున్న కేంద్ర గౌరీ సేవా సంఘం సభ్యులు

తాటిచెట్లపాలెం: ఈ నెల 28న కేంద్ర గౌరీ(గవర) సేవా సంఘం ఆధ్వర్యంలో ఇటీవల పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన గవర విద్యార్థులకు బహుమతుల ప్రదానోత్సవం, అభినందన సభ ఏర్పాటు చేస్తున్నట్లు సంఘ అధ్యక్షుడు బుద్ధ శివాజీ తెలిపారు. రైల్వే న్యూకాలనీలోని సంఘ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పదో తరగతి నుంచి పీజీ వరకు జరిగిన పరీక్షల్లో 80 శాతానికి పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు మెమెంటో, నగదుతో సత్కరించనున్నట్లు చెప్పారు. దరఖాస్తు చేసుకున్న వారందరికీ కన్సోలేషన్ బహుమతులను అందజేస్తామన్నారు. గవర సామాజిక వర్గ పిల్లలకు సంఘం తరపున ఉచితంగా విద్యా బ్యాసం చేయిస్తామని పేర్కొన్నారు. అక్కయ్యపాలెం హైవే పక్కన గల విశ్వనాథ్ కన్వెన్షన్స్(పోర్టు కళావాణి) ఆడిటోరియంలో ఈ నెల 28న వేడుకలు జరుగుతాయన్నారు. ముఖ్య అతిథులుగా పార్వతీపురం జిల్లా కలెక్టర్ ఆడారి శ్యాంప్రసాద్, ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, పి.జి.వి.ఆర్.నాయుడు, వైద్యుడు మళ్ల భాస్కర్ హాజరవుతారని తెలిపారు. ఈ సందర్భంగా కార్యక్రమ కరపత్రికను సంఘ సభ్యులు ఆవిష్కరించారు. సంఘ ప్రతినిధులు మొల్లేటి వీరకుమారస్వామి, వేగి సత్యనారాయణ, మళ్ల బలరాం, పెంటకోట సంజీవరావు నాయుడు, శరగడం సత్యనారాయణ, ఆడారి పారుపల్లి రవి, మళ్ల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐ టూల్‌తో ఊపిరితిత్తుల పరీక్ష


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న డాక్టర్ సుధాకర్ తదితరులు

సీతంపేట: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ద్వారా రూపొందించిన 'శ్వాస' సాఫ్ట్‌వేర్ పరికరంతో ఊపిరితిత్తుల పరీక్షను విశాఖ నగరంలో తొలిసారిగా వీహెల్త్ కేర్ అందుబాటులోకి తెచ్చింది. శంకరమఠం రోడ్‌లోని సంస్థ కార్యాలయంలో గురువారం ఎన్‌ఆర్‌ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ డీన్ డాక్టర్ పి.వి.సుధాకర్ శ్వాస సాఫ్ట్‌వేర్ టూల్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ టూల్ సాయంతో ఊపిరితిత్తుల్లో సమస్యను ప్రాథమికంగా గుర్తించి వైద్యులకు క్షణాల్లో నివేదిక ఇస్తుందన్నారు. ప్రజల్లో ఊపిరితిత్తుల ఆరోగ్యంపై అవగాహన పెంచేందుకు తోడ్పడుతుందని చెప్పారు. ఈ పరికరం దగ్గు శబ్దతరంగాలను విశ్లేషించడం ద్వారా క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజెస్ అయిన ఆస్తమా, క్షయ వంటి వ్యాధులను సులువుగా గుర్తించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సాలినట్ టెక్నాలజీస్ సంస్థ డీఎం పి.శ్రీరామమూర్తి, వైద్యులు ఎస్.నరేష్, ఆర్.వి.కన్నబాబు, వీ హెల్త్‌కేర్ డైరెక్టర్ కె.ఎం.కె.రమేష్, చిన్నం కృష్ణ, సిహెచ్.పార్వతి, కె.పృథ్వీరాజ్ కరపత్రాలు ఆవిష్కరించారు.

ఎర్రమట్టి దిబ్బల సంరక్షణ బాధ్యత ప్రభుత్వానిదే..

సీతంపేట: అధికారుల సహకారంతోనే సహజ వనరుల దోపిడీ జరుగుతోందని, ఉదాసీనత వహిస్తే వారిపై కేసులు వేస్తామని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్యనారాయణ అన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో గురువారం విలేకరులతో ఆయన మాట్లాడారు. జాతీయ గనుల మంత్రిత్వ శాఖ దేశంలో ప్రముఖ జ్యూలాజికల్ హెరిటేజ్ సైట్స్ లిస్టు చేస్తూ 32 స్థలాలను గుర్తించడం జరిగిందన్నారు. వాటిని రాష్ట్ర ప్రభుత్వాలు సంరక్షించి నిర్వహణ చేయాలని 2016లో గనుల శాఖ ఆదేశాలు జారీ చేసిందన్నారు. అందులో ముఖ్యమైన ఎర్రమట్టి దిబ్బలను రక్షించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాలని, పర్యావరణ పరిరక్షణ విషయంలో పార్టీలకతీతంగా సంఘటితంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. వారసత్వ సంపదగా గుర్తించిన ఎర్రమట్టి దిబ్బల సంరక్షణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూస్తోందన్నారు. ఈ వారసత్వ సంపద వినాశనానికి అధికారులే బాధ్యత వహించాలన్నారు. ఎర్ర మట్టి దిబ్బలను సర్వేచేసి బఫర్ జోన్ గుర్తించాలని తెలిపారు.

కుష్టు రహిత జిల్లాయే లక్ష్యం

మహారాణిపేట: ఇంటింటికీ తిరిగి కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. గురువారం తన కార్యాలయంలో నిర్వహించిన వైద్యాధికారులు, డేటా ఎంట్రీ ఆపరేటర్ల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఆశ కార్యకర్త, ఇతర సిబ్బంది డోర్ టు డోర్ సర్వేకు పూర్తి సహకారం అందించాలని కోరారు. విశాఖను కుష్టు రహిత జిల్లాగా మలచాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ జీవన్‌రాణి, డాక్టర్ కె.సత్యవేణి, కె.వి.రమణ, పి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


చిరువ్యాపారులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్న కీర్తి పట్నాయక్

మురళీనగర్: పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని శ్రీదేవి విజ్ఞాన జ్యోతి పరిష్కార్ ట్రస్ట్ అధ్యక్షురాలు కుప్పిలి కీర్తి పట్నాయక్ పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణపై సంస్థ ఆధ్వర్యంలో మురళీనగర్‌లో చిరువ్యాపారులు, పండ్లు, కూరగాయల విక్రయదారులు, పూజా సామగ్రి విక్రయదారులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఇంట్లో ప్లాస్టిక్ వస్తువులకు బదులుగా క్లాత్, జ్యూట్‌తో తయారు చేసిన వస్తువులు మాత్రమే వాడాలని సూచించారు. వ్యాపారులు ప్లాస్టిక్, పాలిథిన్ సంచులను వాడరాదన్నారు. కార్యక్రమంలో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, సూపర్‌వైజర్ సింహాచలం, గణేష్ తదితరులు పాల్గొన్నారు.